PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

ఆదివారం 18-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :138 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## హార్డ్ కరెన్సీ కొరత ఉన్న దేశాలతో రూపాయితోనే వాణిజ్యం

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దేశ ప్రయోజనాలే ముఖ్యం: ఆసియా- పసిఫిక్ ప్రాంతంలోని 16 దేశాలతో కూడిన రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్ట్నర్‌షిప్ (ఆర్‌సీఈపీ) నుంచి భారత్ వైదొలగడం సరైన నిర్ణయమని ఆమె సమర్థించుకున్నారు.



2లో▸

## యువత ఆందోళనలపై ఐరాస ప్రతినిధి వ్యాఖ్యలు..

### తోసిపుచ్చిన భారత్



2లో▸

భారత్‌లో యువత చేపట్టిన ఆందోళనల గురించి ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి గినా రొమెరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి పోరాడుతున్నందుకు ఆ యువత.. ప్రభుత్వం నుంచి వివక్ష, అణచివేతలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడడానికి వారికి తగిన స్వేచ్ఛ లేదంటూ పలు నివేదికలను ఐరాస సమావేశంలో ప్రస్తావించారు.

## రేవంత్ రెడ్డి నీటిని విడిచిపెడితే.. చంద్రబాబు ఒడిసిపట్టారు: హరీశ్‌రావు



2లో▸

తెలంగాణ ప్రాజెక్టుల్లో నీళ్ల లేకుండా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంతకాలం ఏపీ పాలకులు ఏమీ మాట్లాడలేదని..

## మూడు దశల్లో సమగ్ర భూసర్వే



- 285 గ్రామాల్లో సర్వే పూర్తి.. అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ
- వచ్చేనెల చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు
- మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో▸

## ప్రజా చైతన్యానికి యువ దర్శకులు కదలాలి

భారతీయ సినిమాకు హైదరాబాద్‌ను ప్రధాన కూడలిగా తీర్చిదిద్దుతాం: భట్టి విక్రమార్క

- బతుకమ్మ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక
- వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంపై షార్ట్‌ఫిల్మ్‌లతో అవగాహన కల్పించాలి
- యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం



2లో▸

## మున్సిపల్ ఎన్నికలకు టీడీపీ రెండో జాబితా విడుదల..



### ఏపీ మున్సిపల్ ఎన్నికలు

### టీడీపీ రెండో జాబితా రిలీజ్

### మేయర్ అభ్యర్థిగా షేక్ అబిదా

ఆంధ్రప్రదేశ్ లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ ఎన్నికలకు రెండో జాబితాను విడుదల చేసింది. ఒక కార్పోరేషన్, 21 మున్సిపాలిటీల్లో మేయర్, ఛైర్‌పర్సన్ స్థానాలకు మొత్తం 22 మంది అభ్యర్థులను ప్రకటించింది. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను ప్రకటించింది. మున్సిపాలిటీలకు ఛైర్‌పర్సన్ల అభ్యర్థులు.. ఆకివీడు-నిలోఫర్ షేక్, బేతంచెర్ల-లోకేష్ గౌడ్, బుచ్చిరెడ్డిపాలెం-దొడ్ల విజయలక్ష్మీ, చీరాల-స్పందన, డోన్ -కోట్ల సుజాతమ్మ, గుత్తి-గోవిందరాజులు, గుంతకల్లు-యశోద.జంగారెడ్డిగూడెం-రొంగల అనూష, కదిరి-షేక్ సమీరా, కళ్యాణ దుర్గం-బుట్న లక్ష్మీ, కొండపల్లి-కన్నెకంటి అమూల్య, కొవ్వూరు- జొన్నలగడ్డ రాధారాణి, వెంకటగిరి- చేసింది

## సాలార్‌జంగ్ మ్యూజియం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలి: గవర్నర్

దేశంలోని ప్రముఖ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కేంద్రాల్లో ఒకటైన సాలార్‌జంగ్ మ్యూజియంను మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు.



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రదర్శన విధానాలను మెరుగుపరచడం, సందర్శకులకు సమాచారం సులువుగా అర్థమయ్యే రీతిలో అందించడం, విద్యా సంబంధిత కార్యక్రమాలను విస్తరించడం ద్వారా మ్యూజియంను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అన్నారు. సమావేశంలో మొత్తం 13 అజెండా అంశాలను పరిశీలించి, సంబంధిత అంశాలపై చర్చించారు. సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్ మ్యూజియం అభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం మ్యూజియం క్యూరేటర్ (ఎడ్యుకేషన్) జ్యోతి రాయ్ విద్యా కార్యక్రమాలు, మ్యూజియం ఆధునికీకరణ, ప్రదర్శన విభాగాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

## పవన్ కళ్యాణ్‌తో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ భేటీ...



2లో▸

**త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు.**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ భేటీ అయ్యారు. జనసేన కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్.. మోహన్ యాదవ్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరు రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా నాగార్జునసాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేసే అంశాన్ని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు.

## తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు: మంత్రి తుమ్మల

- తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు.
- సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



మిగతాది 2లో

# సంపాదకీయం

## అమెరికా చలిమంటలకు ఏ చమురు అనర్హం!

అవకాశవాదం... అమెరికా.. ఈ రెండిటినీ విడదీసి చూడటం అసాధ్యం. ప్రపంచానికి ఎన్ని ఆదర్శాలను అమెరికా చెప్పిందో అంతకుమించి అవకాశవాదాలనూ ప్రదర్శించింది. స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికీ, ఆనందాన్ని అనుభవించటానికీ పుట్టుకతోనే మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని చాలా గొప్పగా తన స్వాతంత్ర్య ప్రకటనలో చెప్పిన అమెరికా దాన్ని ఏనాడూ పాటించలేదు. ఆఫ్రికా నుంచి కొనుగోలు చేసి అమెరికాకు తెచ్చిన లక్షలాది నల్లజాతీయులకు ఆ హక్కులను ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బానిసత్వాన్ని సహజసిద్ధమైన వ్యవస్థగా ఆమోదించి దశాబ్దాలపాటు దాన్ని అమలుచేసింది. 1965 వరకూ నల్లజాతీయులకు సమానహక్కులను ఇవ్వలేదు. అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకూ దేశాధికారాన్ని విస్తరించే క్రమంలో వందలాది ఆదిమ తెగలను హరించివేసింది. ప్రజాస్వామ్య రాజకీయాలనూ, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రైవేటు వ్యాపారాలనూ ప్రపంచమంతా విస్తరించటమే తన లక్ష్యాలని చెబుతూ అనేక దేశాల్లో నియంతృత్వ ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా నిలిచింది. మత, ఛాందసవాద సమూహాలను ప్రోత్సహించింది. ప్రపంచ ప్రయోజనాల పేరుతో నిన్నటి దాకా తప్పు.. తప్పు.. అని చెప్పి.. ఒక్కరోజులోనే దాన్ని ఒప్పు.. ఒప్పు అనగలిగిన అవకాశవాద నేర్పరితనం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఘనంగా చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. నాలుగేళ్లకు పైగా సాగుతోన్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమే అట్టుడికిపోతోంది. రష్యాది దురాక్రమణగా భావించిన అమెరికా ఎన్ని ఆంక్షలు విధించాలో అన్నీ విధించింది. ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలను అదిరించి బెదిరించి లొంగదీసుకుంది. భారత్ కూడా ఒకదశలో రష్యా నుంచి కొనుగోళ్లను దాదాపుగా ఆపివేసింది. రష్యాతో లావాదేవీలను నడిపే దేశాలపై దిగుమతి సుంకాలనూ అమెరికా పెద్దఎత్తున విధించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే పేరుతో విదేశాల్లో ఉన్న రష్యా ఆస్తులనూ స్తంభింపచేసింది. ఇంతటి శత్రుపూరిత వైఖరిని అతి తేలికగా మార్చుకుని అవకాశవాదంలో తనకు సాటిలేదనే విషయాన్ని అమెరికా మరోమారు స్పష్టంచేసింది. ఇలాంటి అవకాశవాదాన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా నిర్వాకాలపై గతంలో లోతైన విశ్లేషణలూ, కవిత్వాలూ చాలానే వచ్చాయి. 1961లో మహాకవి శ్రీశ్రీ కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెన్నడీని ఉద్దేశిస్తూ కవిత రాశారు. 'అరువులిచ్చి కరువు తెచ్చి.. రుణంపెట్టి రణం తెచ్చి.. జనంధనం ఇంధనమై.. చరణ కరాబంధనమై.. జనన జరా మరణ దురాక్రమణల సంగ్రంథనమై.. ఒకనాడోహో అనిపించుక తిరిగిన.. ధనికవాద మికపై వెగటై జిగటై..' అంటూ ఆనాడు శ్రీశ్రీ రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇప్పటికీ బాగా సరిపోతాయి. ట్రంప్ హయాంలో అమెరికా ధనికవాదం వెగటై.. జిగటై గతంలో ఎన్నడూ లేనంతగా అసహ్యం పుట్టిస్తోంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షులైన అబ్రహం లింకన్, జాన్.ఎఫ్.కెన్నడీ లాంటి వారు వ్యక్తంచేసిన ఆదర్శ అభిప్రాయాలకు ప్రభావితమైన ప్రజాస్వామ్య ప్రియులు చాలామందే ఉండేవారు. ట్రంప్ లాంటి వాళ్లకు అట్లాంటివేవీ లేవు కనుక ప్రతి విధానమూ, ప్రతి ప్రకటనా ఇప్పుడు వెగటుగానే అనిపిస్తోంది. అన్నింట్లోనూ అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామనీ, అందుకు అడ్డుగా ఉన్న అంతర్జాతీయ చట్టాలనూ, సంస్థలనూ, ఒప్పందాలనూ కాలరాస్తామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే చెబుతుంటే నాగరీక మనుషులు సహించలేరు. వేల సంవత్సరాల సంస్కృతులు కలిగి, సుదీర్ఘ చరిత్రలో మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేసిన చైనా, భారత్ లాంటి దేశాల్లో గతం గురించి సమగ్ర అవగాహన పెరుగుతున్న కొద్దీ అమెరికాపై అసహనం ఎక్కువవుతుందే తప్ప తగ్గదు.

అమెరికా మద్దతు లేకపోతే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ఇంతకాలం కొనసాగి ఉండేది కాదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రజాస్వామ్యవాది కాదు. ఆ దేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలూ లేవు. నియంతల మనుగడకూ కొన్ని అంశాలు.. ముఖ్యంగా జాతి ప్రయోజనం, గౌరవం, భద్రత పేరుతో కూడినవి.. చాలా బాగా ఉపయోగపడతాయి. అమెరికా సారథ్యంలోని నాటో కూటమి స్వార్థం, అహంకారంతో వేసిన తప్పటడుగులు రష్యాను ఉక్రెయిన్ మీదకు ఉసిగొల్పేలా చేయగలిగాయి. జర్మనీ ఏకీకరణ (1990) సందర్భంగా నాటో విస్తరణ ఒక్క అంగుళం కూడా అదనంగా ఉండదని ఆనాటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడైన మిఖాయిల్ గోర్బచెవ్‌కు అమెరికా హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకే జర్మనీ ఏకీకరణ సాఫీగా సాగటానికి సోవియట్ యూనియన్ సహకరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే సోవియట్ యూనియన్ (1991 డిసెంబర్ 26) పతనమైంది. రష్యా సహా 15 దేశాలు విడివిడిగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో 9 దేశాలు క్రమంగా నాటోలో చేరిపోయాయి. ఒక్క అంగుళం హామీ అలా గాల్లో కలిసిపోయింది. రష్యాలో 2000 సంవత్సరం వరకూ ఆర్థికంగా అల్లకల్లోల పరిస్థితులే ఉన్నాయి. వీటికీ ఒక రకంగా అమెరికాయే కారణం. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను ఒక్కపెట్టున ప్రైవేటుపరం చేయటంతో పరిస్థితులు గాడితప్పాయి. ప్రభుత్వ సంస్థలనూ, కంపెనీలనూ కారుచౌకగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టారు. అన్నిటినీ మార్కెట్‌కే వదలివేయటంతో ధరలూ, నిరుద్యోగమూ విజృంభించాయి. బ్లాక్‌మార్కెట్ సర్వసాధారణమైంది. విద్య, వైద్యరంగం, ప్రాథమిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో జీవన ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేటురంగంతో పోటీ పెరిగి రష్యా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్న జోస్యాలు ఏ రకంగానూ నిజంకాలేదు. ఒకరకంగా అరాచకమే ప్రబలిపోయింది. అట్లా అమెరికా ప్రభుత్వమూ, ఆ దేశ మేధావులూ సూచించిన విధానాలు అస్తవ్యస్త పరిస్థితులకే దారితీశాయి. పుతిన్ అధికారాన్ని చేజిక్కించుకోటానికి అవే కారణమయ్యాయి. ఆ నేపథ్యంలోనే రష్యాకు మళ్లీ ఒకనాటి వైభవాన్ని తీసుకువస్తానన్న పుతిన్ వాగ్దానాలు ప్రజలపై ప్రభావాన్ని కలగచేశాయి. ఒక భాష, ఒక మతం, ఒక జాతి (జ్ఫ్త్రఅఅఓ జశీఎఎబఅఱఎ) దేశ అస్తిత్వానికి పునాదిగా ఉన్నచోట భావోద్వేగాలను రెచ్చగొట్టటం తేలిక. రష్యాకు చుట్టూ ప్రమాదం ముంచుకొస్తోందన్న పుతిన్ ప్రచారానికి ఆ ఉద్వేగాలు తోడ్పడ్డాయి. ఉక్రెయిన్, జార్జియాలు కూడా భవిష్యత్తులో నాటోలో చేరతాయన్న ప్రకటనతో (2008) రష్యాలో భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక అక్కడి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా బాగా దృష్టి పెట్టింది. రష్యాకు అనుకూలంగా ఉండే ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యూనుకోవిట్ అధికారాన్ని కోల్పోవటంలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల పాత్ర చాలా ఉంది. మైదాన్ విప్లవం పేరుతో ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలకు అమెరికా పూర్తిగా సహకరించింది. ఆ వెంటనే క్రిమియాను రష్యా ఆక్రమించింది. ఉక్రెయిన్‌లోని రష్యా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లను పోత్సహించింది. చివరికి 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగింది. ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కింద అమెరికా ఈ ఏడాది మార్చివరకూ రూ.12 లక్షల కోట్లను ఖర్చుపెట్టింది. మొత్తంగా రూ.17 లక్షల కోట్లు వ్యయం అవుతాయని లెక్కలుకట్టింది. ఇవిగాక ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రూ.1.90 లక్షల కోట్లను రుణంగా ఇప్పించింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరో రూ.22 లక్షల కోట్లను ఉక్రెయిన్ యుద్ధానికి ఖర్చు చేస్తోంది. అంటే అమెరికా, ఈయూ కలిసి దాదాపు రూ.40 లక్షల కోట్లను వెచ్చిస్తున్నాయి. ఉక్రెయిన్ తటస్థ దేశంగా ఉంటుందనీ, నాటో కూటమిలో చేర్చుకునేది లేదనీ స్పష్టంచేయకుండా, నాలుగున్నర ఏళ్ల నుంచీ దౌత్యపరమైన చొరవను ప్రదర్శించకుండా, లక్షల మరణాలకూ, భౌతిక ఆస్తుల విధ్వంసానికి అమెరికాయే ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష కారణమైంది. ఇంతగా కకావికలు చేసి మధ్యంతర ఎన్నికల్లో గెలవటానికి రష్యా చమురు కొనుగోలునే అస్త్రంగా చేసుకుని రాజకీయంగా దిగజారిపోతున్న ప్రతిష్ఠను కాపాడుకోటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అవసరమైతే మళ్లీ రష్యా చమురు అమ్మకాలపై నిషేధాన్ని విధించొచ్చు. యుద్ధం వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణనష్టం లక్షల్లో ఉంది. అనధికార అంచనాల ప్రకారమే ఇరు దేశాలకు చెందిన 6 లక్షల మంది సైనికులు మరణించారు. ఇందులో రష్యను సైనికులే నాలుగున్నర లక్షల దాకా ఉండొచ్చు. పౌరులు 20 వేల మంది చనిపోయి ఉంటారన్నది అంచనా. గాయపడిన వాళ్లు 15 లక్షల దాకా ఉండొచ్చు. ఆస్తుల విధ్వంసం, ఆర్థిక వ్యవస్థకు ఇతరత్రా జరిగిన నష్టం ఉక్రెయిన్‌లోనే రూ.82 లక్షల కోట్లు ఉంటుంది. యుద్ధం ముగిస్తే ఆ దేశంలో పునర్ నిర్మాణానికి రూ.56 లక్షల కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఇక రష్యాలో జరిగిన నష్టం గురించి అంచనాలు బయటకు రావటం లేదు. ఉక్రెయిన్‌తో పోల్చితే అది నాలుగో వంతే ఉండొచ్చు. ఈ శతాబ్దంలో అమెరికా ప్రత్యక్షంగా యుద్ధాలు చేసిన చోటా (ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్), పరోక్షంగా యుద్ధాలను రగిల్చిన చోటా ఎక్కడా శాంతిని నెలకొల్పిన దాఖలాల్లేవు. అవకాశవాదమే పైచేయి అవ్వటంతో మధ్యలోనే తప్పుకొని బాధితులనే పరిస్థితులను చక్కదిద్దుకోమని వదిలివేయటమే ఎక్కువ. ఆఫ్ఘనిస్థాన్‌లో అదే చేసింది. చివరికి తాలిబన్లకే అక్కడ అధికారం అప్పగించింది. వాళ్లక్కడ ఆటవిక పాలనను అమలుచేస్తున్నారు. ఉక్రెయిన్ విషయంలో కూడా అదే చేసే అవకాశం ఉంది. రష్యా కోరిన విధంగా భూభాగాలను అప్పగించి శాంతిని కుదుర్చుకోవాలనే లోపాయికారిగా చెబుతోంది.

## కూటమి నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్.. ఎన్నికల వ్యూహంపై చర్చ

మొదటిపేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ సమన్వయ కమిటీలకు ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జనసేన నేత నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో కూటమి నేతలు తమ అభ్యర్థులతో కలిసి వెళ్లాలని చంద్రబాబు సూచించారు. ఇటీవల చోటుచేసుకున్న ఘటనలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు చంద్రబాబు..

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధన దిశగా సమష్టిగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యత, సమన్వయం కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు.

మేయర్ అభ్యర్థులపై టీడీపీలో కొనసాగుతున్న ఉత్కంఠ

మరోవైపు, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థుల ఎంపికపై టీడీపీలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యంగా గుంటూరు, ఒంగోలు, మచిలీపట్నం నగరాల మేయర్ అభ్యర్థుల పేర్లపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఆశావహులు పోటీలో ఉండటంతో అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ అధిష్ఠానం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ రెండో జాబితా కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. నామినేషన్ల దాఖలుకు గడువు రేపటితో ముగియనుండటంతో అభ్యర్థుల ప్రకటనపై ఆసక్తి పెరిగింది. అయినప్పటికీ, ఆయా నగరాలకు మేయర్ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాలేదన్న చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. మేయర్ అభ్యర్థుల ఎంపికలో జాప్యం ఎందుకు జరుగుతోంది? ఎవరికి అవకాశం దక్కనుంది? అన్న అంశాలు టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రెండో జాబితా విడుదలతో ఈ ఉత్కంఠకు తెరపడుతుందా అన్నది వేచి చూడాలి.

## పవన్ కళ్యాణ్‌తో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ భేటీ.. పులుల సంరక్షణపై కీలక చర్చలు

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ భేటీ అయ్యారు. జనసేన కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్.. మోహన్ యాదవ్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరు రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేసే అంశాన్ని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు సమాచారం. అలాగే నాగార్జునసాగర్– శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో అడవి దున్నలను తిరిగి ప్రవేశపెట్టేందుకు సంబంధించిన ఒప్పందాన్ని త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరారు. అటవీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం ఉందనే అంశంపై ఈ చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.

ఈ సందర్భంగా త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ పర్యటన ద్వారా ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మరింత చర్చించే అవకాశం ఉంది. సమావేశం సందర్భంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు పవన్ కళ్యాణ్ ప్రత్యేక బహుమతులు అందజేశారు. సంప్రదాయానికి ప్రతీకగా ఉప్పాడ పట్టు శాలువా, ఆంధ్రప్రదేశ్ కళా వైభవాన్ని చాటిచెప్పే కొండపల్లి కళాకృతిని బహూకరించారు.

## తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు: మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి



దిల్లీ: తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేత్ బచావో అభియాన్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నుంచి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అంశాలను లేవనెత్తారు. మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలకు 100 శాతం మద్దతు ధర కల్పించాలని కోరారు. ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలన్నారు. రసాయన ఎరువుల ధరలు, రాయితీలను హేతుబద్ధీకరించాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు

## హార్డ్ కరెన్సీ కొరత ఉన్న దేశాలతో రూపాయితోనే వాణిజ్యం

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: అంతర్జాతీయంగా హార్డ్ కరెన్సీ (ప్రధానంగా డాలర్లు, యూరోల) కొరతతో ఇబ్బంది పడుతున్న వాణిజ్య భాగస్వామ్య దేశాలకు మద్దతుగా నిలిచేందుకు, రూపాయితోనే వాణిజ్య చెల్లింపులు చేయాలని భారత్ భావిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్– ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల సందర్భంగా అట్లాంటిక్ కౌన్సిల్ నిర్వహించిన చర్చలో ఆమె పాల్గొన్నారు. 'భారత్ నుంచి వస్తువులను దిగుమతి చేసుకునే పలు దేశాలు, ప్రస్తుతం హార్డ్ కరెన్సీ కొరతను ఎదుర్కొంటున్నాయి. అటువంటి దేశాలకు ఆహార ధాన్యాలు, మందులు వంటివి పంపడంలో ఆటంకాలు లేకుండా.. రూపాయి లేదా వారి స్థానిక కరెన్సీల్లోనే చెల్లింపులు చేసే వ్యవస్థను ప్రోత్సహిస్తున్నాం' అని సీతారామన్ పేర్కొన్నారు.యుద్ధాలు, రుణ సంక్షోభాల ప్రభావం: అంతర్జాతీయ భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధాల కారణంగా పలు వర్ధమాన దేశాలు రుణ ఊబిలో పడి, చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. ఇటువంటి సమయంలో స్పందించడానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు 3–4 ఏళ్ల కాలం తీసుకుంటున్నాయని..అందుకే ద్వైపాక్షికంగా స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని కొనసాగించడం ద్వారా తక్షణ ఉపశమనం లభిస్తుందన్నారు. ఆగ్నేయాసియా దేశాల కూటమి 'ఆసియాన్'తో భారత్ చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వల్ల, భారత్‌కు ప్రయోజనాలు దక్కడం లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ ఒప్పందంలో కొంత మార్పులు చేసి, అమలు చేయాలన్నది తమ యోచనగా వివరించారు.దేశ ప్రయోజనాలే ముఖ్యం: ఆసియా– పసిఫిక్ ప్రాంతంలోని 16 దేశాలతో కూడిన రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ (ఆర్‌సీఈపీ) నుంచి భారత్ వైదొలగడం సరైన నిర్ణయమని ఆమె సమర్థించుకున్నారు. ఆ ఒప్పందం ద్వారా భారత్‌కు ఎటువంటి అదనపు ప్రయోజనం లేదని, పైగా చైనా నుంచి చౌక వస్తువుల దిగుమతులు వెల్లువెత్తి, భారత పరిశ్రమలు, వ్యవసాయ రంగం దెబ్బతినే ప్రమాదం ఉండటం వల్లే 2019లోనే భారత్ ఆర్‌సీఈపీ నుంచి వైదొలిగిందన్నారు. ఆయా సభ్యదేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతున్నప్పటికీ.. పూర్తి ఒప్పందంలో చేరడం భారత్ ప్రయోజనాలకు ఏమాత్రం సరిపోదని స్పష్టం చేశారు.

## యువత ఆందోళనలపై ఐరాస ప్రతినిధి వ్యాఖ్యలు.. తోసిపుచ్చిన భారత్

మొదటిపేజీ తరువాయి

భారత్‌లో యువత చేపట్టిన ఆందోళనల గురించి ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి గినా రొమెరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి పోరాడుతున్నందుకు ఆ యువత.. ప్రభుత్వం నుంచి వివక్ష, అణచివేతలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడడానికి వారికి తగిన స్వేచ్ఛ లేదంటూ పలు నివేదికలను ఐరాస సమావేశంలో ప్రస్తావించారు. ఈ ఆరోపణలను ఐరాసలోని భారత దౌత్యవేత్త అనుజ్ స్వరూప్ కొట్టిపడేశారు. గినా రొమెరో చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని స్పష్టం చేశారు. అధికారిక ధ్రువీకరణ లేని కొన్ని కథనాలను ఆధారంగా తీసుకొని.. ఈ ఆరోపణలు చేశారన్నారు."ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలను భారత్ గమనించింది. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి శాంతియుత సమావేశ స్వేచ్ఛ, సంఘ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తుంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత పత్రికారంగం, జాతీయ మానవ హక్కుల కమిషన్ వంటివి పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నాయి. కేవలం పేరు లేని కొన్ని నివేదికలను ఆధారంగా చేసుకొని.. ఓ దేశంలోని యువత వివక్షను ఎదుర్కొంటున్నారని వాదించడం సరైన చర్యకాదు. ఇటువంటి అత్యున్నత స్థాయి సమావేశాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేసి, ఐక్యరాజ్యసమితి, దాని సంస్థలు విశ్వసనీయతను కోల్పోతున్నాయి.

కెనడాను ముక్కలు చేయాలనుకుంటున్న అమెరికా విచిత్రమేమిటంటే..? భారత్‌లోని యువత ఓ వ్యంగ్య రాజకీయ ఉద్యమాన్ని సృష్టించిందని అదే నివేదిక పేర్కొంది. వారు చెప్పినట్లు దేశంలో ప్రభుత్వ అణచివేత ఉంటే.. నాయకులను ఎలా ప్రశ్నించగలుగుతున్నారు?.. దేశ రాజధానిపైకి ఎలా దూసుకురాగలుగుతారు? భారత్‌లో యువత ఉద్యమాలు చేసినప్పుడు..

## రేవంత్ రెడ్డి నీటిని విడిచిపెడితే.. చంద్రబాబు ఒడిసిపట్టారు: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంతకాలం ఏపీ పాలకులు ఏమీ మాట్లాడలేదని.. రేవంత్‌రెడ్డి వచ్చాకే వారు కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారని పేర్కొన్నారు. నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

"అత్యంత ముఖ్యమైన నీళ్ల విషయంలో నిర్లక్ష్యం ఎందుకు? దేవాదులలో 10 మోటార్లు ఉన్నా.. మూడు మాత్రమే ఆన్ చేశారు. 10 మోటార్లు నడిస్తే వరంగల్ జిల్లాకు కరవు వచ్చేది కాదు. ఏపీలో క్రాప్ హాలీడే లేదు.. కరవు లేదు. దేవాదుల మోటార్లు నడపకే.. నీళ్లు కిందకు పోయాయి. ఏపీలో కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లి జలహారతులు పడుతున్నారు.

# దుర్గా యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ

**భక్తులకు అన్నప్రసాదం అందించిన సర్పంచ్ నారగాని రాంబాయి**





**నాగులవంచ, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి):**
శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో దుర్గా యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నవరాత్రి వేడుకల్లో భాగంగా గ్రామంలోని కచ్చిర్ సెంటర్‌లో భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నవరాత్రుల పవిత్ర సమయంలో అమ్మవారి సేవలో భాగంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దైవసేవతో సమానమని పేర్కొన్నారు. 'అన్నదానం మహాదానం' అనే సందేశాన్ని చాటుతూ దుర్గా యూత్ సభ్యులు భక్తి, సేవాభావం, మానవత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించి అన్నప్రసాదాన్ని అందించిన దుర్గా యూత్ సభ్యులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంకాయలపాటి లచ్చయ్య, నారగాని శ్రీనివాసరావు, తోటకూరి చిన్న, అంబటి శాంతయ్య, సామినేని అప్పారావు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, మద్దినేని వెంకటేశ్వర్లు, బయ్యారు శ్రీరాములు, కొండ గోపి, రౌతు అప్పారావు, బీజేపీ రామారావు, సామినేని బాబురావు, కందరబోయిన కొండలరావు, దుర్గా యూత్ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, భవానీ మాలధారులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

**ఫామ్ పాండ్ల నిర్మాణంతో రైతులకు ప్రయోజనం: జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**






**మెదక్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేందుకు నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. శనివారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వీబీజీ రామ్ జీ ఉపాధి హామీ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి గుంతలు, ఫామ్ పాండ్లు, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు వంటి పనులు చేపట్టాలని సూచించారు. ఈ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు సహజ వనరుల సంరక్షణకు కూడా దోహదపడవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపుపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ఉత్తమ సేవా పతకం అందుకున్న సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి




**సూర్యాపేట, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు--2026 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాల్లో సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి పోలీసు ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ డీజీపీ కార్యాలయంలో రవీందర్ రెడ్డికి పతకాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ కూడా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు విలువైన సేవలందించారని, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, కృషి అభినందనీయమని కొనియాడారు. రవీందర్ రెడ్డి 1992లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో నియమితులై పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో తొలి పోస్టింగ్ చేపట్టారు. అనంతరం 2007లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేవలందించారు. 2017లో డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత సీఐడీ విభాగంలో విధులు నిర్వహించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది వికారాబాద్ జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ డీసీపీగా, నిజామాబాద్‌లో, సికింద్రాబాద్ రైల్వే విభాగంలోనూ వివిధ హోదాల్లో సేవలందించారు. మూడు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో పనిచేస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పతకం లభించడం పట్ల సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ హర్షం వ్యక్తం చేసింది. పోలీసు శాఖకు గౌరవం తీసుకొచ్చిన అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ మరోసారి అభినందనలు తెలిపారు.

# మధిరలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న లింగాల కమల్‌రాజు

**అమ్మవారికి ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమం ప్రారంభం**



**మధిర, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్):**
ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని బంజారా కాలనీలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు స్థానిక నాయకులతో కలిసి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ న్యాయవాది వాసంశెట్టి కోటేశ్వరరావు మాతృమూర్తి దశదిన కర్మ కార్యక్రమానికి లింగాల కమల్‌రాజు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు వై.వి. అప్పారావు, పట్టణ నాయకులు పల్లపోతుల వెంకటేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, పరిశ శ్రీనివాసరావు, మండల నాయకులు రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చీదిరాల రాంబాబు, ఆవుల నాగేశ్వరరావు, గోపి, ఆవుల శ్రీనివాసరావు, నరేందర్, కాసీం తదితరులు పాల్గొన్నారు.

# 35వ వార్డు టీడీపీ అభ్యర్థిగా పాములపాటి శివకుమారి నామినేషన్

**గతంలో కౌన్సిలర్‌గా సేవలందించి వార్డు అభివృద్ధికి కృషి**



**చిలకలూరిపేట (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
చిలకలూరిపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా 35వ వార్డు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థిగా పాములపాటి శివకుమారి సంబంధిత అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. గతంలో కౌన్సిలర్‌గా సేవలందించిన ఆమె వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని స్థానికంగా గుర్తింపు పొందారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవంతో ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో 35వ వార్డు నుంచి ఆమె నామినేషన్ దాఖలు చేయడంతో వార్డులో ఎన్నికల సందడి నెలకొంది

# 19వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా దోగిపర్తి సత్యసాయి నామినేషన్



**చిలకలూరిపేట (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 19వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) కౌన్సిలర్ అభ్యర్థిగా దోగిపర్తి సత్యసాయి నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సంబంధిత ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా దోగిపర్తి సత్యసాయి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా 19వ వార్డును అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, విడదల రజని సహకారంతో వార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వార్డు ప్రజలు తనకు ఆశీస్సులు అందించి, మద్దతుగా నిలవాలని దోగిపర్తి సత్యసాయి కోరారు.

# మాందాపూర్‌లో కన్నులపండువగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**అల్లాదుర్గం అక్టోబర్ 18**
మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామ మహిళలు, ఆడపడుచులు



ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, అక్కాచెల్లెళ్లు, పెద్దింటి ఆడపడుచులు అనే తారతమ్యం లేకుండా అందరూ ఒక్కచోట చేరి సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు. గ్రామంలోని మహిళల గాజుల సవ్వడులు, కోలాట పాటలు, ఆటపాటలు, డీజే పాటల సందడితో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. లచ్చమ్మ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువజన సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సద్దుల బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

# సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి గణేష్ ఏకగ్రీవ ఎన్నిక

**సూర్యాపేట, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):**
సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో రచయితల సంఘాలను ఏర్పాటు చేయగా, ఈ నాలుగు నియోజకవర్గాల కార్యవర్గ సభ్యులు, కవులు, రచయితల విస్తృతస్థాయి సమావేశం శనివారం సూర్యాపేటలోని సుధా బ్యాంకులో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రచయితల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ కవి, పిల్లలమర్రి పినవీరభద్రం కళాపీఠం వ్యవస్థాపకులు శీలా అవిలేను ప్రధాన కార్యదర్శిగా, సీనియర్ రచయిత ఆలేటి శంకర్‌ను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.



గౌరవ సలహాదారులుగా బెల్లంకొండ శ్రీరాములు, గడ్డం నర్సయ్య, తుమ్మ రాజాను నియమించారు. ఉపాధ్యక్షులుగా ధర్మూరి వెంకటేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి, ఎర్ర హరికిషన్, సంయుక్త కార్యదర్శులుగా గొడితాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు, సరికొండ నరసింహారాజు, ప్రచార కార్యదర్శిగా పబ్బతి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ముక్కామల జానకిరాములు, ఏబెల్ శశి, ఎన్.సీ. రోజా, పూసోజు పద్మ, పోతుగంటి వీరాచారి, జిల్లేపల్లి జానయ్య, కొర్రపిడత శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, కొండా లింగారావు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ, జిల్లాలోని కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సాహిత్య, సాంస్కృతిక రంగాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. నూతన, వర్ధమాన కవులు, రచయితలను ప్రోత్సహించి వారి రచనలను ప్రజలకు పరిచయం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కవిత్వ కార్యశాలలు నిర్వహిస్తామని, తెలుగు భాషా ఉపాధ్యాయులతో కలిసి భాషా వికాసానికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, కవిత్వం, కథల పోటీలు నిర్వహించి వారిలో సాహిత్యాభిరుచిని పెంపొందించేందుకు జిల్లా రచయితల సంఘం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీప్రియులు పాల్గొన్నారు

2 1

# భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలను అందించడంలో పండుగలదే కీలక పాత్ర

**సంగారెడ్డి, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొని మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగలో పూలకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయాలను కాపాడుకునే గొప్ప పండుగగా బతుకమ్మ నిలుస్తుందని అన్నారు. ఇలాంటి పండుగలను సామూహికంగా జరుపుకోవడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు, మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.



మహిళలు సామూహికంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడంతో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులతో పాటు సమీప కాలనీలకు చెందిన మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతకుంట వద్ద ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

**ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం**
**గుంతలమయమైన రహదారిపై స్థానికుల ఆగ్రహం**

**అందోల్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం చింతకుంట వద్ద జోగిపేట--మెదక్ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గొల్ల లక్ష్మణ్ తీవ్రంగా గాయపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. చిలిపిచేడ్ మండలం చండూరుకు చెందిన గొల్ల లక్ష్మణ్ ఆటో నడుపుతుండగా చింతకుంట వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. జోగిపేట--మెదక్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలో ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను స్థానికులు ప్రైవేట్ వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జోగిపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కాగా, జోగిపేట--మెదక్ ప్రధాన రహదారి నెలలుగా గుంతలమయంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి దుస్థితి కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# జహీరాబాద్ కోర్టులో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**జహీరాబాద్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని సీనియర్ సివిల్ జడ్జి జి. కవితాదేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సీ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోర్టు ప్రాంగణంలో వివిధ శాఖల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వారు పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కోర్టు ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రకృతిని పూజించే అరుదైన పూల పండుగ బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేకమైనదని, ఈ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని అన్నారు. కోర్టు ఉద్యోగులు, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మండల్ లీగల్ సర్వీసెస్‌కు చెందిన సూపరింటెండెంట్ అనురాధ, శ్రీవాణి, సునీత, స్టెనోగ్రాఫర్ వి. రూప, సూపరింటెండెంట్ స్వాతి, టైపిస్ట్ సంతోషి, ఆఫీస్ సబార్డినేట్లు రూప, మహేశ్వరి, సావిత్రమ్మ, లక్ష్మి, లక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.



# మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీ లలితాంబిక అమ్మవారు

**నారాయణఖేడ్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్):**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలోని శ్రీ లలితా దేవి శ్రీ చక్రపీఠ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, దివ్యాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు నారాయణఖేడ్ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# రైతుల సంక్షోభాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**చౌటకూర్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ప్రతినిధి కె. మల్లేశం గౌడ్):**
రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొని రైతులు సాగునీరు, విద్యుత్ కొరతతో ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విమర్శించారు. శనివారం సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన, సాగునీరు అందక ఎండిపోయిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ, నిండుకుండలా ఉన్న సింగూర్ ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేయడం ప్రభుత్వ దూరదృష్టి లోపానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల పేరుతో నీటిని ఖాళీ చేసి ఏడాది గడిచినా ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని, దీంతో ఆందోల్ నియోజకవర్గ రైతులు సాగునీరు, తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కరవు పరిస్థితులపై బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తుంటే, ప్రభుత్వం పరిష్కారాలు చూపకుండా ప్రతిపక్షంపై ఎదురుదాడి చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని అన్నారు. యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా, ప్రాజెక్టుల నుంచి నీటిని ఎత్తిపోయడం, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి అంశాల్లో ప్రభుత్వం గతంలో చేసిన ప్రకటనలకు, ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరికి పొంతన లేదని విమర్శించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ అధిష్ఠానం లేదా గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. ఆందోల్ నియోజకవర్గాన్ని వెంటనే అధికారికంగా కరవు ప్రాంతంగా ప్రకటించాలని, సాగునీరు అందక ఎండిపోయిన వరితో పాటు ప్రతికూల వాతావరణం వల్ల నష్టపోయిన పత్తి, ఇతర పంటల నష్టాన్ని అధికారులు అంచనా వేసి రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న సింగూర్ ప్రాజెక్టు మరమ్మతులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్నప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన నిరంతరం పోరాడుతూ అండగా ఉంటుందని క్రాంతి కిరణ్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ వీరేందర్, గ్రామ అధ్యక్షుడు ప్రభు లింగాగౌడ్, మురళి గౌడ్, దేవయ్య, దర్శన్ రెడ్డి, మల్లారెడ్డి, రాములు, అనంతయ్య, బసంత్ రెడ్డి, జాఫర్, మల్లేశం, అనిల్ రెడ్డి, గంగారాం, అశోక్, మల్లప్ప తదితరులు, రైతు సంఘాల నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్లలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

**ఫైళ్లు, రికార్డుల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**





**మెదక్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌ను శుభ్రం చేయడంతో పాటు, పోలీస్ స్టేషన్ల ఆవరణల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. పోలీస్ స్టేషన్లలో ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించేందుకు 5ఎస్ విధానాన్ని అమలు చేశారు. అవసరమైన రికార్డులను వర్గీకరించడం, ఫైళ్లను సులభంగా గుర్తించేలా క్రమబద్ధీకరించడం, కార్యాలయ గదులు, ఫర్నిచర్, ఫైళ్ల అల్మారాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. రికార్డుల నిర్వహణలో నిర్దిష్ట ప్రమాణాలను పాటిస్తూ, ఈ విధానాలను నిరంతరం కొనసాగించేలా చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, రికార్డుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కార్యాలయాలను క్రమబద్ధంగా నిర్వహించాలని, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు.

# బాచుపల్లి గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



**బాచుపల్లి, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి):** సంగారెడ్డి జిల్లా బాచుపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామంలోని మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరిన మహిళలు, యువతులు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు, యువతులు ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం విశేషమని పలువురు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో బాచుపల్లి గ్రామంలో పండుగ శోభ వెల్లివిరిసింది.

# పాపన్నపేటలో ఘనంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్



**పాపన్నపేట, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ అల్లాదుర్గం ప్రతినిధి కుమార్):** మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలో భారతి సిమెంట్స్, సుధా ట్రేడర్స్ పాపన్నపేట వారి ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. ఈ పోటీల్లో పొడ్చంపల్లి జట్టు మొదటి విజేతగా నిలవగా, పాపన్నపేట జట్టు రెండో స్థానాన్ని, పొడ్చంపల్లి తండా జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఫైనల్ మ్యాచ్ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భారతి సిమెంట్స్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు నాగేశ్వరరావు, శ్రీధర్, మున్నూరు శంకరయ్య, మున్నూరు సంతోష్, గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పలువురు పేర్కొన్నారు. మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం పట్ల క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆకుల అభిలాష్, సుంకరి సతీష్, పుర్రె శ్రీకాంత్, ఆకుల సాయి, ఆకుల నితీష్, బెస్త శ్రీశైలం, రాజు, దున్న శివగౌడ్, మధునాల అరవింద్, చామంతుల అరవింద్, ఎండీ హాజీ, గంగాధర్, ఎండీ కలీం, చోటు, ఆసిఫ్, నిఖిల్, నాయికోటి శ్రీను, గొల్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని నిర్దేశిత సమయంలో సాధించాలి



**మెదక్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని నిర్దేశిత సమయంలో సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి గృహనిర్మాణ శాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించిన ఆమె, మొదటి, రెండో విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో అధికారులు నేరుగా మాట్లాడి, ప్రభుత్వ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి, నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాకు నిర్దేశించిన ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాన్ని సాధించేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, గృహనిర్మాణ శాఖ ఏఈలు, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చింతకాని ఎంపీడీవో కార్యాలయంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



**చింతకాని, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్వాడీ టీచర్లు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగ విశిష్టతను చాటుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. మహిళల ఉత్సాహం, రంగురంగుల పూలతో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ శాఖ సెక్టార్ సూపర్‌వైజర్లు, తహసీల్దార్ (ఎంఆర్ఓ), ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# రాంసాన్‌పల్లిలో నవదుర్గాదేవిగా దర్శనమిచ్చిన దుర్గాభవాని అమ్మవారు

**శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏడవ రోజు ప్రత్యేక పూజలు**



**అందోల్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు దుర్గాభవాని అమ్మవారు నవదుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దివ్యదర్శనం చేసుకుంటూ 'ఓం శ్రీ మాత్రే నమః' మంత్రాన్ని జపించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సూచించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉపసర్పంచ్ పృథ్వీరాజ్, పట్లోళ్ల మాజీ సర్పంచ్ సువర్ణ దామోదర్ రెడ్డి, శివారెడ్డి, కోరుబోయిని మాజీ సర్పంచ్ లక్ష్మి ఆగమయ్య, జోగిరెడ్డి, జోగేందర్, సారవర్మ, బోయిని గోపాల్, అంజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పాల్వంచ రవి, మల్లేశ్ గౌడ్, శంకర్, మొగులయ్య, లక్ష్మణ్, శివకుమార్, శ్రీనివాస్, గోపాల్, శంకు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# రాంసాన్‌పల్లి గ్రామ ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు



**అందోల్ అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామ ప్రజలకు బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగల సందర్భంగా గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉప సర్పంచ్ పృథ్వీరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలందరూ బతుకమ్మ, దసరా పండుగలను సుఖసంతోషాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో, పరస్పర ప్రేమాభిమానాలతో కలిసిమెలిసి సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.

# దసరా కానుకగా గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



**బహిరన్ దిబ్బ, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి):** దసరా పండుగ సందర్భంగా మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని బహిరన్ దిబ్బ గ్రామ పంచాయతీ కార్మికులకు కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జనార్దన్, తన తండ్రి విట్టల్‌తో కలిసి దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను గుర్తించి పండుగ కానుకగా దుస్తులు అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల సేవలు ఎంతో విలువైనవని, వారి కృషిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దసరా పండుగ వేళ దుస్తులు అందుకోవడంతో గ్రామ పంచాయతీ కార్మికుల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన ఏఎస్ఐ జనార్దన్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంపాటి వీరప్ప, ఉపసర్పంచ్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కోర్మనీ ప్రభు, మలయ్య, పరమేశ్వర్, నవీన్, బస్వరాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం వార్షిక తనిఖీలో భాగంగా కొడిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన, స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు పడేలా పటిష్టమైన ఆధారాలను సేకరించాలని, కోర్టుల్లో కేసుల నిరూపణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడంతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. దొంగతనాల నియంత్రణకు అనుమానితులపై నిఘా పెంచి, రాత్రి పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామస్థాయిలో ప్రజలతో సమన్వయం పెంచుకొని, స్థానిక సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పండుగల సందర్భంగా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు నిర్వహించి శాంతిభద్రతలను పరిరక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, విధులను క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ 112కు వచ్చే అత్యవసర కాల్స్‌పై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని సూచించారు.

# కార్మికులకు కనీస వేతనాలు, జీఓ నెం. 6 అమలు చేయాలి

- కార్మిక శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం



మెదక్, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి): షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, జీఓ నెం. 6 ప్రకారం నిర్ణయించిన వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా జీఓ నెం. 6 విడుదల చేసిందని తెలిపారు. రోజుకు ఎనిమిది గంటల పని ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో అన్‌స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ.14,000, సెమీస్కిల్డ్ కార్మికులకు రూ.15,000, స్కిల్డ్ కార్మికులకు రూ.16,500, హైస్కిల్డ్ కార్మికులకు రూ.18,000 వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే కార్మికులకు కూడా ప్రభుత్వం నిర్దేశించిన వేతనాలను యజమానులు అమలు చేయాలని కోరారు. 2026 అక్టోబర్ 1 నుంచి వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (వీడీఏ) అమలు చేయాలని, ఏడు పాయింట్ల ఆధారంగా ఒక్కో పాయింట్‌కు రూ.33.86 చొప్పున మొత్తం రూ.237గా నిర్ణయించినట్లు వివరించారు. అన్ని రకాల పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, షోరూమ్‌లు, పెట్రోల్ బంకులు తదితర సంస్థలు షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. అయితే జీఓ నెం. 6పై కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో కొందరు యజమానులు ఇష్టానుసారంగా వేతనాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. కొన్ని పరిశ్రమల్లో 12 గంటలపాటు పని చేయించుకుంటున్నప్పటికీ, ఎనిమిది గంటలకు చెల్లించాల్సిన వేతనం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస

# స్వీయ గణనతో సమయం ఆదా.. కచ్చితమైన జనాభా వివరాల సేకరణ






- జనాభా గణనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి: రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళీ కేరి

సంగారెడ్డి, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జనాభా గణనలో స్వీయ గణన ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి, సమయాన్ని ఆదా చేయడంతోపాటు కచ్చితమైన, నాణ్యమైన సమాచారాన్ని సేకరించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళీ కేరి సూచించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు జనాభా గణన రెండో దశ (పాపులేషన్ ఎన్యూమరేషన్)పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, జనాభా గణన మొదటి దశలో గృహాల జాబితా తయారీ, గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. రెండో దశలో ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్వీయ గణనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, కుటుంబంలోని సభ్యులందరి వివరాలను సంబంధిత యాప్‌లో ముందుగానే నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వీయ గణన పూర్తయిన అనంతరం ఎన్యూమరేటర్లు సంబంధిత కుటుంబాలను సందర్శించి, నమోదు చేసిన వివరాలను పరిశీలించాలని, అవసరమైన చోట సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ విధానం ద్వారా ఎన్యూమరేటర్ల పని భారం తగ్గడంతోపాటు ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. జిల్లా జనాభాను దృష్టిలో ఉంచుకొని నిర్ణీత సమయంలో స్వీయ గణన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర శాఖల సిబ్బంది సహకారంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గతంలో నిర్వహించిన హౌస్‌లిస్టింగ్ ఆపరేషన్‌లో సేకరించిన వివరాలను ఆధారంగా తీసుకొని, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల, కొత్త నిర్మాణాలు, వలసలు, గుర్తింపునకు నోచుకోని నివాసాలు, సంస్థాగత గృహాలు, ఖాళీ గృహాలు తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో నమోదు చేయాలని సూచించారు. ఇళ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జనాభా గణనలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీఓ గీత, ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ ఆదేశాలు



సంగారెడ్డి, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్--2026 ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఫారం--6, 7, 8 దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటరు జాబితాలో స్థానం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్--2026 ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, అర్హులైన ఓటర్లకు జాబితాలో చోటు కల్పించేలా ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు) సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెలాఖరు నాటికి పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పాండు, సంగీత, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# మేడికుంద గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు

వట్టిపల్లి, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలంలోని మేడికుంద గ్రామ ప్రజలకు ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, యువతులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, కుటుంబాల్లో ఆనందాన్ని పెంపొందిస్తుందని అన్నారు. తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ సంతోషాన్ని, సౌభాగ్యాన్ని అందించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కచూర్ రావు కోరుకున్నారు.

# దరఖాస్తుపల్లి గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ కాలాలి సురేఖ సత్యనారాయణ గౌడ్

వట్టిపల్లి, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల పరిధిలోని దరఖాస్తుపల్లి గ్రామ ప్రజలకు, గ్రామ నాయకులకు, మహిళలకు, గ్రామ యువకుల కు గ్రామ సర్పంచ్ కాలాలి సురేఖ సత్యనారాయణ గౌడ్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ప్రకృతిలో లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ మహిళలు ఎంతో ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారు. పూలను పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. గ్రామ ప్రజలందరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అని పేర్కొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు,ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నాయిని రాజేందర్ రెడ్డి

**- డిసిసి అధ్యక్షులు వెంకట్రామ్ రెడ్డి మరియు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



(సందేశం టైమ్స్ ప్రతినిధి): శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి అమ్మవారిని శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దర్శించుకొన్నారు.వారి వెంట హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ విశేషాలను, ఏర్పాట్లను వారు అడిగి తెలుసుకున్నారు. దర్శనానంతరం అర్చకులు వారికి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు

# పట్టభద్రుల ఓటర్ నమోదు హెల్ప్ డెస్క్ కార్యాలయం ప్రారంభం




(సందేశం టైమ్స్ ప్రతినిధి): ఈ రోజు శనివారం సూర్యాపేట ఆర్డీవో కార్యాలయం యదుట, శివాలయం ప్రక్కన 21,37,38 వార్డులు కలిపి ఉమ్మడి నల్గొండ-ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా, పట్టభద్రుల ఓటర్ నమోదు హెల్ప్ డెస్క్ కార్యాలయం 37వ వార్డు కౌన్సిలర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బైరు శైలందర్ గౌడ్ మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, 21 వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పొలాగాని బాలు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ మహాషయులు ఉమ్మడి నల్గొండ,ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏఐసీసీ సభ్యులు, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీ తో గేలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ సేవాదల్ జిల్లా అధ్యక్షులు ఆలేటి మాణిక్యం, మరియు 21,37,38వార్డుల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా సర్పంచ్ మహేశ్వరి రాజు

**- మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం**



(సందేశం టైమ్స్ ప్రతినిధి): ఇటీవల మృతి చెందిన గ్రామ పంచాయతీ సభ్యుడు జంగా కుమారస్వామి కుటుంబానికి సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు అండగా నిలిచారు.జంగా కుమారస్వామి కుమార్తె దశదిన కర్మ సందర్భంగా ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సైతం పాల్గొని తమ వంతు సహకారం అందించారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామి కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.బాధలో ఉన్న కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, తాము ఉన్నామనే ధైర్యాన్ని సర్పంచ్ మహేశ్వరి రాజు కల్పించారు.ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ, సేవా దృక్పథంతో ముందుకు సాగడం ఆమె నాయకత్వ లక్షణాలకు నిదర్శనంగా నిలుస్తోంది.గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం ద్వారా ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతను చాటుకున్నారు.మానవత్వం, సేవాభావం కలిసిన ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# సీనియర్ జర్నలిస్టు యండమూరి వరప్రసాద్ కన్నుమూత..

**-పాత్రికేయ రంగానికి తీరని లోటు పలువురికి మార్గదర్శిగా నిలిచిన కలం యోధుడు**

(సందేశం టైమ్స్ ప్రతినిధి): కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్టు యండమూరి వరప్రసాద్ అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో పాటు మధుమేహ సమస్యలతో బాధపడుతున్న ఆయన మృతి పాత్రికేయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మరణవార్త తెలుసుకున్న తోటి పాత్రికేయులు, మిత్రులు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.ప్రజా సమస్యలపై నిరంతరం కలం పోరాటం సుదీర్ఘ పాత్రికేయ ప్రస్థానంలో ఆంధ్రజ్యోతి, సాక్షి, సూర్య తదితర పత్రికల్లో పనిచేసిన యండమూరి వరప్రసాద్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ప్రజల ఇబ్బందులను, స్థానిక సమస్యలను తన కథనాల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేశారు. వృత్తిపట్ల నిబద్ధత, నిజాయితీ, సామాజిక బాధ్యతతో పనిచేస్తూ జర్నలిస్టుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు.పలువురికి మార్గదర్శిగా..పాత్రికేయ రంగంలో తనకున్న అపార అనుభవంతో తోటి జర్నలిస్టులకు సలహాలు, సూచనలు అందిస్తూ వారిని ప్రోత్సహించారు. విద్యార్థి సంఘాల నాయకులకు సైతం మార్గనిర్దేశం చేస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. వృత్తిపరమైన విలువలకు ప్రాధాన్యతనిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం కలాన్ని ఆయుధంగా మలిచిన ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొంటున్నారు.పాత్రికేయ రంగానికి తీరని లోటు యండమూరి వరప్రసాద్ మృతి బాన్సువాడ ప్రాంతంతో పాటు కామారెడ్డి జిల్లా పాత్రికేయ రంగానికి తీరని లోటుగా పలువురు అభివర్ణిస్తున్నారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన అందించిన సేవలను స్మరించుకుంటున్నారు. తన అనుభవంతో ఎందరో జర్నలిస్టులకు దిశానిర్దేశం చేసిన ఆయన ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని సహచర పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలువురి సంతాపం.. కుటుంబానికి



ప్రగాఢ సానుభూతి సీనియర్ జర్నలిస్టు యండమూరి వరప్రసాద్ మృతి పట్ల పలువురు పాత్రికేయులు, మిత్రులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై ఆయన సాగించిన కలం పోరాటం, పాత్రికేయ రంగానికి అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

3

# ప్రభుత్వ ముందుచూపు లేకనే విద్యుత్ కోతలు..

**- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి**

**- యాసంగి పంటకు ఇప్పుడే ప్రణాళిక సిద్ధం చేయాలి**

**- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి**

(సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు విద్యుత్ కోతల సమస్యను ఎదుర్కొంటున్నారని కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేఎల్పీ ఉపనేత కాటిపల్లి వెంకట రమణారెడ్డి విమర్శించారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ కోతలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ ఎస్ఈ సాల్య నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్, సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆరు నెలల ముందే తెలిసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో చూపుతున్న శ్రద్ధను రైతుల సమస్యల పరిష్కారంపై చూపడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు అవసరమైన సాగునీటిని తప్పనిసరిగా అందించాలని ఆయన కోరారు. రాబోయే యాసంగి పంట సాగుకు అవసరమైన విద్యుత్, సాగునీటి సరఫరాపై ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ముందస్తు ప్రణాళికలు లేకపోతే భవిష్యత్తులో సాగునీటితో పాటు తాగునీటి అవసరాలను తీర్చడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.రైతులు పంటలు సాగు చేసే



కీలక సమయంలో విద్యుత్ కోతలు విధించడం వల్ల వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, సాగునీటి సమస్యలను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి, రాబోయే యాసంగి సీజన్‌కు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

2

# మూలవిరాట్ స్పర్శ దర్శనంతో అమ్మవారి దీవెనలు..

(సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం నగరంలోనిశుక్రవరపేటలో శ్రీనిమిషాంబికా దేవి ఆలయంలో దసరా విజయదశమి పర్వదినాన కల్పించే మూలవిరాట్ స్పర్శ దర్శనం వెనుక ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక సాంప్రదాయం, శతాబ్దాల నాటి సంస్కృతి మరియు ఒక బలమైన పురాణ చరిత్ర కలిగి ఉంది... దేవాలయ శాస్త్రం ప్రకారం శరన్నవరాత్రుల 9 రోజులు గర్భగుడిలో పీఠాధిపతులు, వేద పండితులు నిరంతరం జరిపే చండీ హోమాలు, మూలమంత్ర జపాలు, లలితా సహస్రనామ కుంకుమార్చనల వల్ల వెలువడే మంత్ర శక్తి అంతా గర్భగుడిలోని మూలవిరాట్ విగ్రహంలో మరియు ఆమె ముందుండే పవిత్ర శ్రీచక్రంలో నిక్షిప్తమవుతుంది.కావున దసరా రోజున ఈ పూజా ఫలం పరాకాష్ఠకు చేరుకుంటుంది. ఆ సమయంలో భక్తులు నేరుగా వెళ్లి అమ్మవారి పాదాలను లేదా శ్రీచక్రాన్ని తమ చేతులతో తాకినప్పుడు, ఆ విగ్రహంలో ఉన్న అత్యంత శక్తివంతమైన పాజిటివ్ ఎనర్జీ దివ్య శక్తి భక్తుల శరీరంలోకి ప్రవేశిస్తుంది.. సాధారణ రోజుల్లో భక్తునికి, దేవునికి మధ్య పూజారి ఒక మాధ్యమంగా ఉంటారు. కానీ విజయదశమి నాటి స్పర్శ దర్శనం ద్వారా భక్తులకు తన కష్టాన్ని, బాధను నేరుగా తల్లి పాదాల చెంత చేర్చి, క్షణ కాలంలోనే నిమిషంలోనే మనశ్శాంతిని, కోరికల నెరవేర్పును.నవరాత్రులలో భాగంగా లక్ష్మీ, సరస్వతి, దుర్గా స్వరూపాలుగా పూజలందుకున్న శ్రీనిమిషాంబికా దేవి విజయదశమి నాటికి విజయ ప్రదాయినిగా మారుతుంది. ఆ విజయ సంకేత దినాన భక్తులు ఆమెను తాకి నమస్కరిస్తే రాబోయే ఏడాది పొడవునా ఎలాంటి ఇబ్బందులు, శత్రు పీడలు ఉండవని శతాబ్దాలుగా వస్తున్న నమ్మకం అని ఆలయ చైర్మన్ నామేపల్లి మోహన్ రావు,మరియు భక్తులు తెలిపారు.. స్పర్శ దర్శనం రోజున భక్తులు తమ వెంట తెచ్చుకున్న నిమ్మకాయలను అమ్మవారి పాదాల చెంత లేదా శ్రీచక్రంపై ఉంచి, చేతులతో తాకించి తెచ్చుకున్న నిమ్మకాయను ఇంట్లో ఉంచితే దుష్టశక్తులు దరిచేరవని, వ్యాపార సంస్థలలో ఉంచితే లాభాలు వస్తాయని ఈ ఆలయానికి వచ్చే భక్తులు నమ్ముతారు..కానీ భక్తులకు ఆ ఒక్క రోజు లభించే స్పర్శ భాగ్యం కోసం దసరా నాడు ఖమ్మం నగరంలోని శు




క్రవార పేట లోని శ్రీనిమిషాంబికా దేవి ఆలయం చుట్టూ భక్తులతో కిక్కిరిసిపోతాయి..

# స్వయం సమృద్ధి పర్యాటక కేంద్రంగా జక్సాని నాగన్న బావి..

**–మహిళా సంఘాలకు ఉపాధి.. జల సంరక్షణకు ప్రతీకగా చారిత్రక కట్టడం**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలోని చారిత్రక కట్టడం జక్సాని నాగన్న బావి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో ఈ చారిత్రక బావిని పర్యాటకం, మహిళా సాధికారత, జల సంరక్షణలను మేళవించిన స్వయం సమృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతోపాటు స్థానికులకు ఉపాధి కల్పించడం, పర్యాటక ప్రాంతాన్ని ఆదాయ వనరుగా అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది. కలెక్టర్ ఆదేశాలతో అభివృద్ధి పనులు పూర్తి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఈ నెల 9న నాగన్న బావిని సందర్శించి, అక్కడ చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బావి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతూ సందర్శకులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు అవసరమైన పనులను పూర్తి చేశారు. జానపద గీతం చిత్రీకరణకు వేదికగా నాగన్న బావి నాగన్న బావి చారిత్రక ప్రాధాన్యతకు తోడు పర్యాటక ఆకర్షణగా గుర్తింపు పొందుతుండటంతో, 'థకిట షో' సంస్థ తమ జానపద గీతం 'భామ సుందరాలో' చిత్రీకరణకు ఈ ప్రదేశాన్ని ఎంపిక చేసుకుంది. చారిత్రక కట్టడానికి ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామ పంచాయతీ అధికారులు నిర్వాహకులకు సూచించారు. ఇందుకు అంగీకరించిన చిత్ర బృందం గ్రామ పంచాయతీకి రూ.8,000 రుసుము చెల్లించింది. ఈ నెల 13వ తేదీ రాత్రి సుమారు 100 మంది కళాకారులతో పాట చిత్రీకరణ విజయవంతంగా నిర్వహించారు. ఈ పాట గ్లింప్స్‌ను అక్టోబర్ 15న యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఈ పాటకు వెంకట్ అజ్మీరా సంగీతం అందించగా, శేఖర్ వైరస్ నృత్య దర్శకత్వంతోపాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. మాధురి రాథోడ్ ఈ పాటలో నటించారు.



**మహిళా సంఘాలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం**

నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు దాని నిర్వహణ బాధ్యతలను స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించడం ద్వారా వారికి స్థిరమైన ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రాంగణ పరిశుభ్రత, సందర్శకులకు అవసరమైన సౌకర్యాల నిర్వహణ, పర్యాటకులకు సేవలు అందించడం వంటి కార్యకలాపాల ద్వారా మహిళా సంఘాలకు ఆదాయ అవకాశాలు కల్పించవచ్చు. అలాగే, మహిళా సంఘాల ఆధ్వర్యంలో అల్పాహార కేంద్రాలు, స్థానిక ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు, గ్రామీణ హస్తకళల స్టాళ్లు వంటి సేవలను ఏర్పాటు చేసే అవకాశాలు ఈ నమూనాకు మరింత బలాన్నిస్తాయి. వీటి అమలు వివరాలు అధికారికంగా నిర్ధారించిన అనంతరం చేర్చవచ్చు. ఆదాయంతోనే నిర్వహణ.. జల సంరక్షణపై అవగాహన చిత్రీకరణలు, సందర్శకుల ద్వారా వచ్చే ఆదాయాన్ని బావి నిర్వహణ, పరిశుభ్రత, అవసరమైన మరమ్మతులు, సందర్శకుల సౌకర్యాల కల్పనకు వినియోగించడం ఈ స్వయం సమృద్ధి పర్యాటక నమూనా ముఖ్య ఉద్దేశం. తద్వారా ప్రభుత్వంపై నిరంతర ఆర్థిక భారం తగ్గడంతోపాటు, పర్యాటక కేంద్రం తన ఆదాయంతోనే నిర్వహణ కొనసాగించుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు, పురాతన మెట్ల బావుల పరిరక్షణ ద్వారా సంప్రదాయ జల సంరక్షణ పద్ధతుల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయవచ్చు. చారిత్రక కట్టడాలను కాపాడుకోవడం, నీటి వనరుల ప్రాముఖ్యతను భావితరాలకు అందించడం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం వంటి అంశాలకు నాగన్న బావి అభివృద్ధి దోహదపడనుంది. కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు, గ్రామస్తులు చిత్రీకరణకు అవసరమైన ఏర్పాట్లలో సహకరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు దర్శకులు, నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన ఎంపీడీఓ, ఎంపీఓ, ఎస్ఐ, గ్రామ పంచాయతీ సిబ్బందిని అభినందించారు. జిల్లా కలెక్టర్ చొరవతో తమ గ్రామంలోని చారిత్రక నాగన్న బావికి గుర్తింపు లభిస్తోందని లింగంపేట్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చారిత్రక సంపదను పరిరక్షిస్తూ పర్యాటక అభివృద్ధికి, స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక వారసత్వ పరిరక్షణ, మహిళా సాధికారత, జల సంరక్షణ, స్థానిక ఆదాయ వృద్ధి లక్ష్యాలను సమన్వయం చేసేలా నాగన్న బావి అభివృద్ధి కొనసాగితే, భవిష్యత్తులో ఇది జిల్లాలో ఆదర్శప్రాయమైన స్వయం సమృద్ధి పర్యాటక కేంద్రంగా నిలిచే అవకాశం ఉంది.
6

# జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

**– తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ ఆటలను ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగకు మన సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు మహిళల్లో ఐక్యతను, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తించి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పండుగ సంబరాల్లో మునిగిపోయారు. మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన



బతుకమ్మల రూపకర్తలకు బహుమతులు అందజేసి, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డీఆర్‌డీఏ అధికారి దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఏ అధికారి విజయలక్ష్మి, వెంకటేష్, టీజీవో అధ్యక్షుడు దేవేందర్, టీజీవో కార్యదర్శి సాయిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
7

# దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకున్న 'మనకోసం మనం' వ్యవస్థాపకుడు కిషోర్ కుమార్..

**– మహమ్మద్ నగర్, గున్కుల్ గ్రామాల్లో ప్రత్యేక పూజలు**



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
ఉమ్మడి మండలంలోని మహమ్మద్ నగర్, గున్కుల్ గ్రామంలో కొలువుదీరిన దుర్గాభవాని అమ్మవారిని 'మనకోసం మనం' వ్యవస్థాపకుడు కిషోర్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మండపం వద్దకు చేరుకున్న కిషోర్ కుమార్‌ను మండప నిర్వాహకులు, భక్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మండపం వద్ద ఉన్న భక్తులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో, ఐకమత్యంతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మండప నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై జరిగిన దాడిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు తీవ్రంగా ఖండించారు ఎంపీ స్థాయి ప్రజాప్రతినిధిపై దాడి జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు ప్రజల తరపున పనిచేసే ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు జెడ్ ప్లస్ భద్రత ఉన్న వ్యక్తిపై సైతం దాడి జరిగిందన్న ఆరోపణలు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన కలిగిస్తున్నాయని బత్తుల రామారావు పేర్కొన్నారు రాజకీయ విభేదాలు హింసకు దారితీయకూడదని ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని ఆయన స్పష్టం చేశారు అధికారంలో ఎవరున్నా చట్టం అందరికీ సమానంగా వర్తించాలని ప్రజాప్రతినిధుల భద్రతతో పాటు సామాన్య ప్రజల రక్షణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు ఎంపీ మిథున్ రెడ్డిపై జరిగిన దాడి ఘటనపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు చర్యలు తీసుకోవాలి ఘటనలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని బత్తుల రామారావు డిమాండ్ చేశారు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని హింసకు తావులేకుండా ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ఆయన తెలిపారు

# అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి వరంగల్ కింగ్స్ జట్టు ఘన విజయం

**– సి ఆర్ వై ఏ 2026 క్రికెట్ టోర్నమెంట్‌లో వరంగల్ కింగ్స్ జట్టు సత్తా చాటింది...**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):




అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డికి చెందిన వరంగల్ కింగ్స్ జట్టు, రాయలీనా కింగ్స్ జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వరంగల్ కింగ్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన రాయలీనా కింగ్స్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు మాత్రమే చేయగలిగింది. వరంగల్ కింగ్స్ 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో యెరువ మహేష్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో 41 బంతుల్లో 57 పరుగులు సాధించడంతో పాటు, బౌలింగ్‌లో 23 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేశాడు. శ్రీకాంత్ రెడ్డి 47 పరుగులతో బ్యాటింగ్‌లో రాణించగా, నిఖిల్ రెడ్డి బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి జట్టు విజయానికి తన వంతు సహకారం అందించాడు. అంబటి లౌర్దు రెడ్డి కూడా బ్యాటింగ్‌లో 18 పరుగులు సాధించడంతో పాటు బౌలింగ్‌లో ఒక వికెట్ పడగొట్టాడు. వరంగల్ కింగ్స్ జట్టు సమష్టి కృషి, కీలక సమయాల్లో బ్యాటర్ల బాధ్యతాయుతమైన ఆటతీరు, బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన ఈ విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా యెరువ మహేష్ రెడ్డి ప్రదర్శన మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి వరంగల్ కింగ్స్ జట్టుకు టీం ఏబిఆర్ తరఫున హృదయపూర్వక అభినందనలు. రాబోయే మ్యాచ్‌లలోనూ ఇదే జోరు కొనసాగిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిద్దాం.

# భద్రకాళి అమ్మవారు సన్నిధిలో జోగినపల్లి సంతోష్ కుమార్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా వరంగల్ కు విచ్చేసిన మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ తో కలిసి వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన,ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు,కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర కమిటీ మెంబర్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ నర్సంపేట నియోజకవర్గ నాయకులు నాడెం శాంతి కుమార్, ఎన్ఆర్ఐ రాజుకుమార్ స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.